# బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 9 ,(ప్రజాజ్యోతి )** బాల్యవివాహాలు నిర్వహించిన , వాటికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన నవంబర్ 27 ను పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సభ్యులు జిల్లా ఎస్పీ ని గురువారం మర్యాదపూర్వకం గా కలిశారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా బాల్యవివాహాలు చేసిన సహకరించిన వారిపై బాల్య వివాహ

మిగతా 2 లో...




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 10 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 6




# ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

- **తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు**
- **ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి**
- **పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి:కలెక్టర్ అంకిత్**

**ఇల్లందు, సెప్టెంబర్ 9 (ప్రజాజ్యోతి )** టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజనం, పరిశుభ్రత, యూనిఫాంలు, వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. 8, 9, 10వ తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో

మిగతా 2 లో...

# ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్**

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 9 ,(ప్రజాజ్యోతి )** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27 న జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ కోరారు, బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, పర్యాటక, ఇతర శాఖల అధికారులతో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం

మిగతా 2 లో...

## కొత్తగూడెంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో

# ఠాగూర్ సినిమా రిపీట్

- **మృతి చెందిన 5 నెలల పసిబిడ్డకు వైద్యం పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసిన ఆసుపత్రి యాజమాన్యం**
- **మృతదేహంతో ఆసుపత్రి ఎదుట శిశువు బంధువుల ఆందోళన**




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 9,(ప్రజా జ్యోతి)** ఠాగూర్ సినిమాలో ఒక మృతి చెందిన వ్యక్తికి వైద్యం చేసి భారీగా డబ్బులు వసూలు చేసిన సంఘటనను సినిమాలో

మిగతా 2 లో...

## భద్రాచలంలో రెస్టారెంట్ల పై

# ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,భద్రాచలం/ సెప్టెంబర్ 9,(ప్రజా జ్యోతి)** భద్రాచలం పట్టణంలోని టిఫిన్ హోటల్స్, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శరత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా భద్రాచలంలోని 12 రెస్టారెంట్లపై తనిఖీ చేయగా రెస్టారెంట్ లో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించిన అధికారి ఆహార భద్రత నియమాలను పాటించని 7 రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేశారు, తనిఖీల సందర్భంగా నాణ్యత ,పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా లేని 15 కిలోల గ్రేవీ, 20 కిలోల మాంసం, 3 కిలోల మసాలా పేస్ట్, మొత్తం 38 కిలోల ఆహార పదార్థాలను డిస్కర్డ్ చేశారు, అనంతరం రెస్టారెంట్ల యజమానులకు లోపాలను సరిదిద్దుకునేందుకు 15 రోజుల గడువు ఇచ్చారు ,ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయ డం

మిగతా 2 లో...



# ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి





(మొదటి పేజీ తరువాయి...)
లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, స్కాలర్ షిప్ కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్ కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యా బోధనకే కేటాయించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ, విద్యార్థి పార్ల మెంట్, బ్యాంకు ఖాతాల ప్రారంభం, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్ ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకు పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా నేర్పడం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి ప్రయోగాల్లో స్వయంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలన్నారు. కొత్తగా చేరిన కొంతమంది విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా అందలేదని ప్రిన్సిపల్ వివరించడంతో, అర్హులైన విద్యార్థులందరికీ యూనిఫాంలు త్వరగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భోజనశాల, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రతలోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ప్రధాన వంట మనిషి అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలియడంతో విద్యార్థులకు భోజనంలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్ రూమ్ లోని కూరగాయలు, రిఫ్రిజిరేటర్ లోని పాలు, పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వెల్నెస్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందుల నిల్వ, వినియోగానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విద్యాబోధన, ప్రయోగాత్మక విద్య, ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యం, హాజరు తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తమ బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



(మొదటి పేజీ తరువాయి...)
సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధిపై ఆసక్తి ఉన్న యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్ ల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని, ఫిల్మ్ టూరిజం ద్వారా కూడా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని సూచించారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్ లను గుర్తించి డిజిటలైజేషన్ చేయనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించి, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా టూరిజం నోడల్ అధికారి అనూష, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి...)
నిరోధక చట్టం , పోక్సో యాక్ట్ కూడా విధించబడుతుందని తెలిపారు. బాల్యవివాహాలు జిల్లాలో ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం తెలిసినట్లయితే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా జస్ట్ రైట్స్ వారికి తెలియజేయాలని కోరారు, ఎస్పీ ని కలిసిన వారిలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ సభ్యులు మోహన్ మాన్సింగ్ రవిచంద్ర నాగేంద్రబాబు మౌనిక పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్9, (ప్రజాజ్యోతి)** ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి, సామాజిక చైతన్యానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. కాళోజీ కేవలం కవి మాత్రమే కాకుండా సామాజిక ఉద్యమకారుడిగా, ప్రజా చైతన్యవేత్తగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని , తెలంగాణ మాండలిక భాషలో సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ, సాధారణ ప్రజల జీవితాలు, వారి కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబించినందుకే ఆయనకు ప్రజాకవి అనే బిరుదు లభించిందని అన్నారు. సమాజంలోని అన్యాయాలు, అసమానతలపై తన రచనల ద్వారా గళమెత్తిన కాళోజీ ఆలోచనలు నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు, కాళోజీ నారాయణరావు సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, కలెక్టరేట్ ఏఓ అనంత రామకృష్ణ, సీపీఓ సునీత, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఠాగూర్ సినిమా రిపీట్



(మొదటి పేజీ తరువాయి...)
చూసాము, కానీ నేడు కొత్తగూడెం పట్టణంలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో ఠాగూర్ సినిమా రిపీట్ అయింది, మృతి చెందిన 5 నెలల పసిబిడ్డకు ఆసుపత్రి యాజమాన్యం వైద్యం చేస్తామని చెప్పి భారీగా డబ్బులు వసూలు చేసిన సంఘటన బుధవారం కొత్తగూడెం పట్టణంలో చోటుచేసుకుంది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామానికి చెందిన కిరణ్ ,యశోద దంపతులకు , 5 నెలల కుమారుడు ధనుష్ అనారోగ్యానికి గురయ్యాడు ,దీంతో చికిత్స నిమిత్తం చిన్నారిని కొత్తగూడెంలోని యామిని ఆసుపత్రికి తీసుకు వెళ్లారు, దీంతో ఆసుపత్రి వైద్యులు బిడ్డను చేర్చుకునే సమయంలోనే ముందస్తుగా డబ్బులు చెల్లించాలని తెలిపారు, కేవలం 12 గంటల వ్యవధిలోని 80 వేలు బిల్లు వేసి 44 వేలు వసూలు చేశారు ,డబ్బులు చెల్లించిన తర్వాత కూడా బిడ్డ ఐసీయూలో ఉన్నాడని చెబుతూ తల్లిదండ్రులను చూడనివ్వలేదు, అనుమానం వచ్చిన బాధితులు ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కి సమాచారం అందించారు, ఆమె వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తో మాట్లాడడంతో ఆసుపత్రి సిబ్బంది లొంగిపోయి చిన్నారిని చూపించారు, అయితే అప్పటికే మృతదేహం నీలిరంగులోకి మారి నిర్జీవంగా ఉంది, చనిపోయిన పసిబిడ్డకు చికిత్స అందిస్తున్నట్లు నమ్మించి దారుణంగా డబ్బులు గుంజారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు, అనంతరం పసిబిడ్డ మృతికి కారకులైన వైద్యులను అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు, ఈ విషయం తెలిసిన వెంటనే వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పలు పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ఆసుపత్రి వద్దకు చేరుకొని బాధితులను పరామర్శించి ఆందోళనకు మద్దతు తెలిపారు, ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సదరు ఆసుపత్రిని వెంటనే సీజ్ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

## భద్రాచలంలో రెస్టారెంట్ల పై ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు






(మొదటి పేజీ తరువాయి...)
వంట ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం, నాణ్యమైన ముడి పదార్థాలను ఉపయోగించడం ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నిబంధనలను నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హోటల్ యజమానులకు అధికారులు సూచించారు, ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన ఆహారం అందించేందుకు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు

# పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా రుద్ర హోమం





**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / సెప్టెంబర్ 9, (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కెపి, జగన్నాధపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం రుద్ర హోమం పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు, పూజా కార్యక్రమంలో భాగంగా ముందుగా మేల తాళాలతో, వేదమంత్రాలతో, అమ్మవారి స్వామి వారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆలయం నుండి ఊరేగింపుగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలకు తీసుకొచ్చి మండపారాధన, గణపతి పూజలు నిర్వహించిన అనంతరం రుద్ర హోమం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు, హోమంలో పాల్గొన్న దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం తో పాటు, శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎన్ రజనీకుమారి తోపాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం

- -ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిన కౌన్సిలర్



**ఇల్లందు, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి )**మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు నందు బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి, వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్ లు మాట్లాడుతూ నేడు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, భగభగ మండుతున్న ఎండల నుండి మనల్ని కాపాడేది చెట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో కనీసం రెండు మొక్కలు నాటి వాటిని బిడ్డలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. వనాలు ఉంటేనే వర్షాలు కురుస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్ ను గ్రహించి, మనకు ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ ను అందిస్తాయని, అందుకే మొక్కలు నాటడం అనేది ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. వార్డును పచ్చదనంతో నింపేందుకు మున్సిపాలిటీ తరపున అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆలేటి చిన్ని, ఆర్పి మమత, టిఎంసి నాగయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అతహర్, శానిటేషన్ కార్మికులు రేసు సాయి, రాపర్తి భాగ్యమ్మ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ సహాయం మంత్రిని కలిసిన బిజెపి నేతలు



**ఇల్లందు, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి )** భద్రాచలం కు వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను బుధవారం బిజెపి నేతలు కలిశారు. ఇల్లందుకు ప్యాసింజర్ రైలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఇల్లందుకు ప్యాసింజర్ వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేసినట్లు బిజెపి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ విజయ చంద్ర రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలగాని గోపికృష్ణ గౌడ్, నాయకులు మావునూరి మాధవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కు ప్రాణహాని కలిగించే కుట్రలపై పోలీసుస్టేషన్ లో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి ):**తెలంగాణ జాతిపిత, తొలి తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ప్రాణహాని కలిగించే కుట్రపై బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం బూరంపహాడ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధకుడు కేసీఆర్ కు భౌతికంగా కీడు జరగాలని కోరుకోవడం నేరపూరిత చర్య అన్నారు. పార్టీపరంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ నేరాన్ని ప్రోత్సహించేలా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్ చావుకోరుతూ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నేరాన్ని ప్రోత్సహిస్తున్న వారిని క్షమించవద్దని, చట్టపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో జవాబు చెప్పలేక బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావుకోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ తో పాటు నేరాన్ని ప్రోత్సహించిన రేవంత్రెడ్డిపై కేసునమోదు చేయాలని బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సారపాక పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను, మండల నాయకులు మేడం లక్ష్మినారాయణరెడ్డి, దారం కృష్ణారెడ్డి, మేడగం శ్రీనివాసరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, బానోతు శ్రీను, వార్డుసభ్యులు నాగేశ్వరరావు, కోటయ్య, తుంగ నాగయ్య, మాజీ గ్రామకమిటీలు కాసిమళ్ల సురేష్, బోరెం శ్రీను, గుల్మహ్మద్, కామిరెడ్డి పద్మ, మాజీ ఎంపీటీసీ దాసరి వెంకటరమణ, బండారి లక్ష్మినారాయణ, మదమంచి రాజేశ్వరరావు, సాదిక్పాషా, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవీ.రమణ, యారం వెంకటరెడ్డి, నరేష్రెడ్డి, పంగి సురేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

- ఎస్సీ సెల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ డిమాండ్



**అశ్వాపురం, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ దేపంగి వెంకటరమణ అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయ విమర్శలు చేసే సమయంలో హుందాతనం, బాధ్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలని దేపంగి వెంకటరమణ కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారుల సమయపాలనపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి
- సిపిఎం మండల కార్యదర్శి : సత్రపల్లి సాంబశివరావు



**మణుగూరు, సెప్టెంబర్ 09 (ప్రజాజ్యోతి )** : మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కొంత మంది అధికారులు, ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించడం లేదని సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ఆరోపించారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఉద్యోగులకు జీతభత్యాలు, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు చెల్లిస్తున్నప్పటికీ, కొంతమంది ఉద్యోగులు విధులకు సమయానికి హాజరు కాకపోవడం, కార్యాలయాలు మరియు పాఠశాలల్లో సమయపాలన పాటించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరై గిరిజనులు, పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదా లేదా అనే అంశాలపై అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల హాజరు నమోదును పర్యవేక్షించి, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేసే పరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## రెవెన్యూ అధికారుల ఫీల్డ్ వర్క్ షురూ

- మణుగూరులో మూడు గ్రామాల్లో రీ-సర్వే
- అనంతారం,అన్నారం,చిన్నరాయిగూడెం భూ హద్దులకు క్లారిటీ ఇస్తున్న వైనం
- భూ యజమానుల సమక్షంలో హద్దుల నిర్ధారణ
- మణుగూరు తహసీల్దార్ ఆధ్వర్యంలో భూ సర్వే






**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 09. ప్రజాజ్యోతి** మణుగూరు మండలంలోని మూడు గ్రామాల్లో రెవెన్యూ శాఖ రీ–సర్వే పనులను వేగవంతం చేసింది. బుధవారం అనంతారం,అన్నారం, చిన్నరాయిగూడెం గ్రామాల్లో భూములకు సంబంధించి రీ–సర్వే నిర్వహించారు. సంబంధిత భూ యజమానుల సమక్షంలో భూముల హద్దు ల నిర్ధారణ ప్రక్రియను అధికారులు చేపట్టారు. భూముల సరిహద్దులపై స్పష్టత తీసుకురావడం తో పాటు రికార్డుల ప్రకారం హద్దులను నిర్ధారించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రీ–సర్వేలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, డీటీ రామారావు, సర్వేయర్ నరేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గర్భిణులు, తల్లులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి):** గర్భిణులు, తల్లులు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషక విలువతో కూడిన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సెక్టార్ సూపర్వైజర్ స్వరాజ్యం అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ సెక్టార్ పరిధిలోని ఎంపీబంజరు–4 అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించా రు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మా ట్లాడుతూ తల్లులు బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్వాడీలో అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. గర్భిణులు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి, తల్లులు, పిల్లలు, గర్భిణులు పాల్గొన్నారు.

## కాళోజి ఆశయాలే విద్యార్థులకు ఆదర్శం

- **కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్**







**చర్ల, సెప్టెంబర్ 09(ప్రజా జ్యోతి ):** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ కవి, తెలంగాణ ముద్దుబిడ్డ కాళోజి నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్ మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదిరించినోడు మహనీయుడు కాళోజి నారాయణరావు అని అన్నారు. కాళోజి ప్రతి విద్యార్థికి ఆదర్శమూర్తి అని కొనియాడారు. తన అక్షరాలను ప్రజా సమస్యలపై ఆయుధాలుగా మలిచి, నా గొడవ రచన ద్వారా సమాజంలో చైతన్యాన్ని రగిలించిన ప్రజాకవి కాళోజి అని అన్నారు .ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. సుధాకర్ మాట్లాడుతూ కాళోజి నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారని ప్రజాకవిగా, 'కాళన్న'గా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తన కలంతో పోరాడి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ బాబు ఎవరు?

- **భద్రాచలం శిశు గృహంలో ఓ చిన్న బాబు!**
- **బాబు పేరెంట్స్ వచ్చి 30 రోజుల్లోగా బాబుని తీసుకువెళ్లాలి**





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 9,(ప్రజా జ్యోతి)** భద్రాచలం పట్టణంలోని శిశు గృహంలో ఓ చిన్న బాబు ఉన్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా బుధవారం తెలిపారు, బాబుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా అధికారులను సంప్రదించాలని తెలిపారు, లేనిపక్షంలో ఈ బాబుని అనాదిగా ప్రకటించి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎవరికైనా దత్తత తీసుకునే వారికి ఇస్తామని తెలిపారు

# అక్రమాలపై చలనం లేని జిల్లా యంత్రాంగం?

- **అశ్వరావుపేటలో హెచ్ పీ గ్యాస్ దందాపై నిఘా ఏది?**
- **అధికారులకు సమాచారం ఉన్నా దాడులు ఎందుకు లేవు?**
- **క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ముడుపుల మాయాజాలమా?**
- **అశ్వరావుపేటలో నిర్వహిస్తున్న హెచ్.పీ గ్యాస్ కార్యకలాపాలకు చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్నాయా?**
- **గత ఆరు నెలల్లో సివిల్ సప్లైస్ అధికారులు ఎన్ని తనిఖీలు చేశారు?**
- **అనుమతులు లేకుంటే ఎందుకు సీజ్/చట్టపరమైన చర్యలు తీసుకోలేదు?**



- **ఎల్పిజి నిల్వ, రవాణా, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను ఎవరు తనిఖీ చేశారు?**
- **అధికారులపై వస్తున్న ముడుపుల ఆరోపణలపై జిల్లా స్థాయిలో విచారణకు సిద్ధమేనా?**

**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 9**

అశ్వరావుపేట పట్టణంలో హెచ్ పీ గ్యాస్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. అనుమతులు, డిస్ట్రిబ్యూషన్ విధానం, నిల్వ సామర్థ్యం, అగ్నిమాపక భద్రత వంటి అంశాలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు చర్యలు కనిపించకపోవడంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఇది నిజంగా అనుమతులతో నడుస్తున్న వ్యవస్థేనా?

లేక అధికారిక డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థకు వెలుపల గ్యాస్ సరఫరా జరుగుతోందా? అనుమతులు ఉంటే వాటి వివరాలను అధికారులు బహిర్గతం చేయాలి. అనుమతులు లేకుంటే ఇంత కాలం చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ముడుపుల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?

క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు కొందరికి ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు నిజమా? నిజం కాకపోతే ఆ ఆరోపణలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఎల్పిజి వ్యవహారంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. అందుకే తనిఖీలు, నిల్వ ప్రదేశం, సిలిండర్ల రవాణా, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### సివిల్ సప్లైస్ అధికారులు ఎందుకు స్పందించడం లేదు?

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయా? వస్తే వాటిపై ఎలాంటి విచారణ జరిగింది? ఎవరైనా అధికారులు స్థల పరిశీలన చేశారా? అక్రమంగా నిర్వహిస్తున్నట్టు తేలితే ఎన్ని కేసులు నమోదు చేశారు? లేకపోతే ఎందుకు చర్యలు తీసుకోలేదు?జిల్లా యంత్రాంగం వెంటనే ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసి అశ్వరావుపేటలోని సంబంధిత గ్యాస్ కార్యకలాపాలపై సమగ్ర తనిఖీ చేయాలి.ప్రజల భద్రతే ముఖ్యమా? లేక అక్రమాలకు అండగా నిలిచే మౌనం ముఖ్యమా?

## రాహుల్ విజ్ఞాన్ లో కాళోజి జయంతి





**చర్ల, సెప్టెంబర్ 09: (ప్రజాజ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ మాండలిక భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వర్మరాజు అధ్యక్షత వహించగా ముందుగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జి. వర్మరాజు, తెలుగు ఉపాధ్యాయులు ఆనంద్ పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజి జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడు, శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి, విశ్వనాథ సత్యనారాయణ, దాశరథి కృష్ణమాచార్యులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మొల్ల తదితర ప్రముఖ కవుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆయా కవుల జీవిత విశేషాలు, సాహిత్య సేవలను విద్యార్థులు వివరించారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.డాక్టర్ డి.ఎస్. కుమార్, డాక్టర్ ప్రతిభ, ఇ.డి. శాస్త్రి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలంగాణ మాండలిక భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలుగు విభాగాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ఉపాధ్యాయులు రమ, రాజేశ్వరి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేకు నర్సాపురంలో శ్రీకారం

- **భూధార్ కోసం రైతుల ఎదురుచూపులు.. వేగంగా సర్వే పూర్తి చేయాలని విజ్ఞప్తి**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 9, (ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలంలోని నర్సాపురం రెవెన్యూ గ్రామం ఎంపికైంది. ఈ నేపథ్యంలో బుధవారం సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నర్సాపురం గ్రామాన్ని సందర్శించి భూముల హద్దులను గుర్తిస్తూ రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. అధికారులు పంట పొలాల్లో సర్వే నిర్వహించడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం రెవెన్యూ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా పలువురు రైతులకు భూములకు పట్టాలు లేకపోవడంతో రీ సర్వే ద్వారా భూధార్ వస్తుందని చిన్న, సన్నకారు రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. భూముల రీ సర్వే పూర్తయితే భూముల వివరాలు స్పష్టంగా నమోదవడంతో పాటు రైతులకు హక్కుల పరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సర్వే, రెవెన్యూ అధికారులు పంట పొలాల్లో ప్రత్యక్షంగా పర్యటిస్తూ భూముల హద్దులను గుర్తించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన రైతులకు భూధార్ అందించాలని రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణ, జీపీఓ బాలకృష్ణ, సర్వేయర్లు రాజేశ్వరి, పల్లవి, అజయ్, రైతులు భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుబాకుల రాము, బన్నె ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీఎస్ కేటీపీఎస్ కాలనీ పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ





**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని ఎంపీపీఎస్ కేటీపీఎస్ కాలనీ పాఠశాలను జిల్లా విద్యాధికారి డి. వాసంతి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్‌తో కలిసి పాఠశాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధనా విధానం, పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బేస్‌లైన్ రిపోర్టును డీఈఓ పరిశీలించారు. ముఖ్యంగా గణితంలో గుణకారాలు, భాగాహారాలు చేయడంలో కొంతమంది విద్యార్థులు వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. ఆయా అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పాఠశాలలో ఏఎక్స్ఎల్ కార్యక్రమం ఇంకా ప్రారంభించకపోవడాన్ని గుర్తించిన డీఈఓ, వెంటనే కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రిమీడియేషన్ టైమ్‌టేబుల్, లైబ్రరీ రికార్డులను పరిశీలించారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ లో ఉపాధ్యాయుల చెక్ ఇన్ వివరాలను పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు నమోదును కూడా సమీక్షించారు. ఇంకా కొంతమంది విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందలేదని గుర్తించిన డీఈఓ, వారికి వెంటనే వర్క్‌బుక్స్ అందేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారికి సూచించారు. అనంతరం మూడో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయురాలి బోధనా తీరును, పాఠ్యాంశాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధన కొనసాగించాలని సూచించారు. చివరగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈఓ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, తగిన పరిమాణంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా డీఈఓ డి. వాసంతి సూచించారు.

# మండల స్థాయి ఉపాధ్యాయ వేడుకలు



**చర్ల, సెప్టెంబర్ 09: (ప్రజాజ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారి పి. వెంకట రమణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో యాదయ్య, విశిష్ట అతిథిగా చర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి. వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతో పాటు సమాజానికి సరైన మార్గనిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో కీలకమని అన్నారు . క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు దోహదపడుతున్నారని తెలిపారు. ఎంపీడీవో ఈదయ్య మాట్లాడుతూ నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎంతోమంది ప్రముఖులు తమ జీవితంలో ఏదో ఒక దశలో ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించినవారేనని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న మండలంలోని 30 మందికి పైగా ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. వారికి శాలువాలు కప్పి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. హరిప్రసాద్, భీషమ్మ, విజయ్‌బాబు, రాజేశ్వరి ,విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచలో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి

- వీధికుక్కలు, కోతుల స్వైర విహారం.
- ప్రజల్లో భయాందోళన.
- మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి కాల్వ ప్రకాశరావు



**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి :** పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, కుక్కలు, కోతుల నుంచి ప్రజలను కాపాడేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి కాల్వ ప్రకాశరావు కోరారు. పట్టణంలోని అన్ని డివిజన్లలో వీధికుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ బాటసారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చేపలు, చికెన్, మటన్ దుకాణాలు అధికంగా ఉన్న రాజీవ్‌గాంధీ మార్కెట్ ప్రాంతంలో కుక్కల సంచారం విపరీతంగా పెరిగిందని తెలిపారు. బుధవారం ఉదయం సుమారు 5.45 గంటలకు వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో దమ్మపేట రోడ్డు డంపింగ్ యార్డు సమీపంలో ఓ పాదచారిపై నాలుగు వీధికుక్కలు దాడికి ప్రయత్నించాయని కాల్వ ప్రకాశరావు తెలిపారు. తాను సమయానికి అక్కడికి చేరుకుని కుక్కలను తరిమివేసి, ఆ వ్యక్తిని తన వాహనంపై కాలనీ వరకు సురక్షితంగా తీసుకెళ్లినట్లు చెప్పారు. గతంలో శ్రీనివాస కాలనీలో తనపై కూడా వీధికుక్కలు దాడికి ప్రయత్నించాయని ఆయన తెలిపారు. అదేవిధంగా శ్రీనివాస కాలనీ నుంచి బంజార కాలనీ వరకు రోడ్లపై సంచరిస్తున్న కోతులు బాటసారులపై దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. రాతిచెరువు కట్టపై కూడా పెద్ద సంఖ్యలో వీధికుక్కలు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కాల్వ ప్రకాశరావు కోరారు. వీధికుక్కలను నియంత్రించేందుకు నిబంధనల ప్రకారం వాటిని పట్టుకుని సంరక్షణ కేంద్రాలకు తరలించాలని, కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూడకుండా, ముందస్తు చర్యలు తీసుకుని వీధికుక్కలు, కోతుల బెడదను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు.



# మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలి

- మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి.
- పాల్వంచ మండల సర్వసభ్య సమావేశంలో సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండల సమగ్ర అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అధికారులు పూర్తి సహకారం అందించాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలను నెరవేర్చే విధంగా గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల స్థాయిలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు నిర్వహించే సర్వసభ్య సమావేశాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశాలకు కొంతమంది అధికారులు గైర్హాజరవుతున్నారని కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా సమావేశాలకు హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలపై చర్చ జరిగే కీలక సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరై తమ శాఖకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే పాల్వంచ మండలంలోని గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

- పలువురికి గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు
- గాయాలైన వారిని పరామర్శించిన సిపిఐ నాయకులు

**పాల్వంచ (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలో కూలీలతో వెళుతున్న ఒక ట్రాక్టర్ బోల్తాపడగా పలువురు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం పాల్వంచ మండలంలో చోటుచేసుకుంది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ మండలం సత్యనారాయణపురం–మందేరికలపాడు గ్రామాలకు చెందిన సుమారు 15 మంది కూలీలు పొలం పనులకు ట్రాక్టర్ పై వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా డ్రైవర్ నిర్లక్ష్యం వలన ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో ట్రాక్టర్ లో ఉన్న సుమారు ఏడు గురు కి తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలు అయ్యాయి, గాయాలైన వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**క్షతగాత్రులను పరామర్శించిన సిపిఐ నాయకులు**

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో గాయలైన కూలీలను పాల్వంచ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సిపిఐ మండల అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్రావు, జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు , పలువురు నాయకులు పరామర్శించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని. తీవ్రంగా గాయపడిన కూలీలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ నిరుపేద కూలీలు ప్రమాదవశాత్తు పడి గాయాల పాలవడంతో వారి కుటుంబ సభ్యులు చాలా ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని కావున గాయపడిన కూలీలకు ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి 30,000/–వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని. తీవ్రంగా గాయపడి చేతులు విరిగిన, తల పగిలిన వారికి 50,000/– ఏబై వేల రూపాయల తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం సర్పంచ్ జర్పుల సంధ్య, నవీన్ మందేరికెలపాడు సర్పంచ్ బానోత్ లక్ష్మి –మోహన్ ఉప సర్పంచ్ కందుకూరి శ్రీను, మాజీ ఉపసర్పంచ్ కాటి అచ్చయ్య, పార్టీ ప్రజాసంఘాల నాయకులు చిల్లా కృష్ణ , నవీన్ తదితరులు ఉన్నారు.





## చెరుకు భాగ్యలక్ష్మికి ఘన సన్మానం

- బీజేపీ జిల్లా ముఖ్య కార్యవర్గ సమావేశం



**భద్రాచలం / పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని గోదావరి కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా ముఖ్య కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. కేంద్ర సహాయ హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పోటీ చేసి విజయం సాధించిన ఏకైక బీజేపీ అభ్యర్థి చెరుకు భాగ్యలక్ష్మి ని నాయకులు ఘనంగా సన్మానించారు. ఆమెను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రజల్లో మరింతగా పనిచేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి

- బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాల్వంచలో నిరసన



**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** భారత రాజ్యాంగంపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తూ పుస్తకం రచించారంటూ హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించలేదంటూ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, హమారా ప్రసాద్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రచనా ప్రక్రియలో కీలక పాత్ర పోషించారని, రాజ్యాంగ రూపకల్పనకు సంబంధించిన చారిత్రక అంశాలను వక్రీకరించకూడదని నాయకులు పేర్కొన్నారు. ప్రజల్లో తప్పుడు ప్రచారం జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వివాదాస్పద వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. నిరసన అనంతరం హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని కోరుతూ పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో బహుజన ఐక్య వేదిక నాయకులు ఫిర్యాదు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, కాల్వ ప్రకాశరావు, శనగ వెంకటేశ్వర్లు, నబీ సాహెబ్, బొమ్మెర శ్రీనివాసరావు, మంజూర్, వాసుమల్ల రావు, గొడ్ల మోహన్ రావు, మెంటం బలరాం, గుర్రం లక్ష్మయ్య, కుశాల్ నాయక్, పెంకి శ్రీనివాసరావు, సోయం సత్యనారాయణ, ఆరెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన గడ్డం రాము

- క్రీడా విద్యారంగంలో మరో మైలురాయి
- పరిశోధకుడికి అభినందనలు




**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** క్రీడా విద్యారంగంలో పాల్వంచకు చెందిన గడ్డం రాము మరో మైలురాయిని సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) ను విజయవంతంగా పూర్తి చేశారు. గడ్డం రాము ప్రస్తుతం పాల్వంచ మండలం కొమ్ముగూడెం జడ్‌పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (పీడీ)గా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్యపై ఆసక్తితో జాతీయ స్థాయిలో యూజీసీ-నెట్, న్యూఢిల్లీ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన కొనసాగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్, సీనియర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పర్యవేక్షణలో "ఎఫెక్ట్ ఆఫ్ సర్క్యూట్ ట్రైనింగ్ అండ్ ప్లయోమెట్రిక్ ట్రైనింగ్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ మోటార్ ఫిట్‌నెస్ అమాంగ్ స్ప్రింటర్స్ ఆఫ్ తెలంగాణ" అనే అంశంపై ఆయన పరిశోధన చేపట్టారు. జూన్ 20, 2026న పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కృషికి గుర్తింపుగా సెప్టెంబర్ 8, 2026న జరిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ వార్షిక స్నాతకోత్సవం (కన్వొకేషన్) bలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. తెలంగాణ గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఛాన్సలర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా సమక్షంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరాం, భారత్ బయోటెక్ హైదరాబాద్ వ్యవస్థాపకుడు, చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణ ఎల్ల చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు. తెలంగాణకు చెందిన స్ప్రింటర్లలో మోటార్ ఫిట్‌నెస్ అభివృద్ధికి సర్క్యూట్ ట్రైనింగ్, ప్లయోమెట్రిక్ ట్రైనింగ్ ఎంతవరకు దోహదపడతాయనే అంశంపై గడ్డం రాము చేసిన పరిశోధన క్రీడాకారుల శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు శాస్త్రీయ శిక్షణ విధానాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పీహెచ్‌డీ సాధించిన గడ్డం రామును ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు.

## కాళోజీ నారాయణ వేషధారణలో ఆకట్టుకున్న దారా సీర్తిక్

- తెలుగు భాషా దినోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థి





**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు బుధవారం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష, సాహిత్యం గొప్పతనాన్ని చాటుతూ వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో విద్యార్థి దారా సీర్తిక్ కాళోజీ నారాయణ వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కాళోజీ నారాయణ పాత్రలో సీర్తిక్ తనదైన శైలిలో సందేశాన్ని అందిస్తూ తెలుగు భాష ప్రాధాన్యతను, మాతృభాషపై ప్రతి ఒక్కరికీ ఉండాల్సిన అభిమానాన్ని చాటిచెప్పాడు.తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి కాళోజీ నారాయణ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన భావాలను విద్యార్థులకు పరిచయం చేసేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతృభాష పట్ల విద్యార్థుల్లో ఆసక్తి, అభిమానం పెంపొందించడమే లక్ష్యంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.కాళోజీ నారాయణ వేషధారణలో దారా సీర్తిక్ ఆకట్టుకోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అతడిని అభినందించారు. తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం విద్యార్థుల్లో భాషపై మరింత ఆసక్తిని పెంచేలా సాగింది.

## యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు

- ఉద్యోగాలు కల్పించాలి.
- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- యువత హక్కుల కోసం సంఘటిత పోరాటాలు.
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ

**పాల్వంచ, సెప్టెంబర్ 9, ప్రజాజ్యోతి:** యువత భవిష్యత్తుతో ప్రభుత్వాలు చెలగాటం ఆడకుండా, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ డిమాండ్ చేశారు.పాల్వంచ పట్టణంలోని మంచికంటి భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ పాల్వంచ పట్టణ, మండల మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో యువత, విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోవడం ఆందోళనకరమన్నారు."చదువు పూర్తయింది.. ఉద్యోగం ఎక్కడ? అర్హత ఉంది.. నియామకం ఎక్కడ? నైపుణ్యం ఉంది.. అవకాశం ఎక్కడ? ఖాళీ పోస్టులు ఉన్నాయి.. భర్తీ ఎప్పుడు?" అంటూ ప్రభుత్వాలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**యువత హక్కుల కోసం పోరాటమే లక్ష్యం....** యువత సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటాలను నిర్మించాలనే లక్ష్యంతో 1980 నవంబర్ 3న లూధియానాలో డీవైఎఫ్ఐ ఆవిర్భవించిందని హరికృష్ణ తెలిపారు. విద్య, ఉపాధి, ఉద్యోగాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల కోసం యువతను సంఘటితం చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. "డీవైఎఫ్ఐ ఒక సంస్థ పేరు మాత్రమే కాదు.. యువత పోరాటాలకు ఒక వేదిక, యువత హక్కులకు ఒక గొంతుక" అని పేర్కొన్నారు.

**ప్రశ్నించడం యువత హక్కు....** ప్రభుత్వాలను ప్రశ్నించడం వ్యతిరేకత కాదని, అది ప్రజాస్వామ్య హక్కు అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా యువత సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. యువత మౌనంగా ఉంటే సమస్యలు కొనసాగుతాయని, యువత ప్రశ్నిస్తేనే మార్పు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

**డీవైఎఫ్ఐ పాల్వంచ నూతన కమిటీ ఎన్నిక ....** మహాసభలో డీవైఎఫ్ఐ పాల్వంచ పట్టణ, మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బి. వినయ్, కార్యదర్శిగా సూర్య ఎన్నిక కాగా, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బాలాజీ వెంపటి, పోతురాజు పవన్ కుమార్ ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులను కాళంగి హరికృష్ణ, లిక్కి బాలరాజు అభినందించారు. తమ భవిష్యత్తును ఎవరో నిర్ణయిస్తారని ఎదురుచూడకుండా యువత తమ హక్కుల కోసం తామే నిలబడాలని పిలుపునిచ్చారు. మహాసభలో డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా నయీమ్ జన్మదిన వేడుకలు

- మాల జేఏసీ ఆధ్వర్యంలో కేక్ కట్.. శాలువాతో ఘన సన్మానం



**అశ్వాపురం, సెప్టెంబర్ 9 ప్రజాజ్యోతి::** అశ్వాపురం మండల కేంద్రంలోని నేటికేసరి పినపాక నియోజకవర్గ ప్రతినిధి షేక్ నయీమ్ జన్మదిన వేడుకలు బుధవారం సందడిగా జరిగాయి. మాల జేఏసీ ఆధ్వర్యంలో చెట్టి సురేష్‌నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నయీమ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నయీమ్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకల సందర్భంగా పలువురు సన్నిహితులు, మాల జేఏసీ నాయకులు, శుభాకాంక్షలు తెలియజేసి నయీమ్ ను అభినందించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమంలో చెట్టి సురేష్, ప్రజాజ్యోతి రిపోర్టర్ అప్పన మురళి, జూపల్లి ధ్రువకుమార్, మేకల భాస్కర్, చెట్టి మనోజ్, సమీర్, గుండేటి రాజేష్, వర్షిని, చిన్ను తదితరులు పాల్గొన్నారు.